డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

మన్సూరాబాద్: కాలనీలలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధి వాంబేకాలనీ, డబుల్‌బెడ్‌రూం సముదాయాలు, హిందూ స్మశానవాటిక తదితర ప్రాంతాల్లో జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కార్పొరేటర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హిందు స్మశానవాటిక వద్ద పొంగుతున్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి అర్చన, నాయకులు సంజీవరెడ్డి, సునీల్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని సుభద్రానగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో సీసీ రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన రోడ్లకు అంచనాలు రూపొందించి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముక్తిఘాట్ వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా చూడాలి

నాగోలు: డివిజన్ పరిధిలోని ఫతుల్లగూడలోని ముక్తిఘాట్ మహాప్రస్థానాని వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ -సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. గురువారం నాగోల్ డివిజన్ లోని ఫతుల్లగూడలో ముక్తిఘట్ హిందూ స్మశాన వాటికను అధికారులతో కలసి కార్పొరేటర్ చింతల అరుణ పరిశీలించారు. బీజేపీ నాయకులు సిద్దాల ఐలయ్య, సంజీవ రెడ్డి, పద్మారెడ్డి, రాము గౌడ్, అమర్, ముక్తిఘట్ అధికారులను తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం కేలండర్ ఆవిష్కరణ

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం నూతన కేలండర్‌ను గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన వాగ్దానాన్ని ఈసందర్భంగా సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి, ప్రధాన కార్యదర్శి తుడిమళ్ల లవకుమార్, కోశాధికారి రాగిఫణి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు వెంకటాచారి, శ్రీనివాసచారి, గోవర్ధనాచారి, నరసింహాచారి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

మూసారంబాగ్ సమస్యలు పరిష్కరించండి

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి గురువారం నగరంలోని కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిశారు. డివిజన్‌లో పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడంలో జాప్యం అవుతున్న కారణంగా కాంట్రాక్టర్లు అభివృద్ధి చేయడం లేదని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు అయ్యే విధంగా చూడాలని కోరినట్లు తెలిపారు. శానిటేషన్‌తో పాటు సమస్యలను విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కమీషనర్ సానూకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు.

హైదరాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ విజయం ఖాయం

సైదాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేసారు. గురువారం పార్టీ నగర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నూతన ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన చంద్రశేఖర్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి ఆయన పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. జిల్లా పార్టీ నాయకులతో కలిసి ఆయన చంద్రశేఖర్‌జీని శాలువా కప్పి సన్మానించారు. జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక యూనియన్ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి.చైతన్య, సరూర్‌నగర్ సర్కిల్ సిఐటియు కన్వీనర్ మల్లెపాక వీరయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సరూర్ సర్కిల్ ప్రాంతంలో ఆర్‌కేపురం భవన నిర్మాణ కార్మిక సంఘం లేబర్ అడ్డా దగ్గర ఫిబ్రవరి 16వ తారీకు సమ్మెను గ్రామీణ బంధు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. భవన నిర్మాణ కార్మిక యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌కేపురం లేబర్ అడ్డా అధ్యక్షతన వి వెంకటయ్య కార్మికులతో సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య

నాగోలు: భర్త మృతి చెందడంతో డిప్రెషన్‌లో వెళ్లినటో మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌కుంట, సరస్వతినగర్ కాలనీలో ఉండే వరాల సునీత(42) భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. దీంతో సునీత డిప్రెషన్‌లోకి వెళ్లింది. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది గత నెల 29న పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామినేని హాస్పిటల్‌కు తరలించారు. సునీత హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

రాక్‌టౌన్ కాలనీలో విద్యార్థిని..

నాగోలు: అనారోగ్యం కారణంగా ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్ రాక్‌టౌన్ కాలనీ చెందిన కన్నెగంటి బ్రహ్మం బాబు కూతురు దీప్తి(18) ఇంటర్ పూర్తి చేసిన నీట్ పరీక్షల కోసం ఇంటి వద్ద చదువుకుంటోంది. దీప్తి గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నది. గురువారం మధ్యాహ్నం దీప్తి నిద్రించడానికి తన బెడ్ రూమ్‌లోకి వెళ్లింది. ఇంట్లో ఉన్న తన సోదరి పావని మందుల కోసం మెడికల్ షాపునకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చేసరికి బెడ్ రూమ్ తలుపు వేసిఉంది. ఎంత సేపు తలుపు కొట్టినా తీయలేదు. తలుపు పగులగొట్టి చూడగా దీప్తి చీరతో సీలింగ్‌కు వేలాడుతూ కనిపించింది. చికిత్స నిమిత్తం కామినేని హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హస్తినాపురం: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్ తెలిపిన మేరకు.. హుడాసాయినగర్ కమాన్ పక్కనగల దుకాణాల సముదాయం రెండవ అంతస్తులో పాడు బడ్డగదిలో దాదాపు 50 నుండి 60 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుని ఆచూకి గురించి ఇరుగుపొరుగువారిని విచారించగా ఎలాంటి సమాచారం లభించలేదని, మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో ఉంచామన్నారు.

తరచూ ట్రాఫిక్ జామ్..నిత్యం పరేషాన్

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో వాహనచోదకుల ఇబ్బందులు



వనస్థలిపురం రైతు బజారు కూడలిలో..

వనస్థలిపురం: వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌ల ప్రధాన రహదారులలో పేరొందిన కంపెనీలకు చెందిన షోరూంలు, కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్లు, బ్యాంకులు, హోటళ్లు, పలు వాణిజ్య సముదాయాలు ఏర్పడడంతో రద్దీ ప్రాంతాలుగా మారాయి. అయితే వాణిజ్య సముదాయాలు, బ్యాంకులకు సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో వాటి వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఆ దారిన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పోలీసుస్టేషన్ ముందు స్టేషన్‌కు వచ్చే వారు, సిబ్బంది తమ వాహనాలను రోడ్డుపైనే రెండు వరుసల్లో పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ వద్ద ఇదే పరిస్థితి. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు బ్యాంకుకు సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌జాంలు తప్పడం లేదు.
- వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పాఠశాలల వద్ద కూడా తరచు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యార్థులను తీసుకుపోవడానికి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో బస్సులు, ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద మూడు వైపులనుంచి వచ్చే వాహనాలు జిగ్‌జాగ్‌గా వెళుతుండడంతో తరచుగా ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన వెళుతున్నారు.
- వనస్థలిపురం రైతుబజారు వద్ద నాలుగు రోడ్ల కూడలిలో ఇదే పరిస్థితి. నాలుగు వైపుల నుంచి వాహనాలు జిగ్‌జాగ్‌గా వెళుతుండడంతో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని పెట్టాల్సిన అవసరం ఉంది.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్ నుంచి బీఎస్ రెడ్డినగర్ చౌరస్తా వరకు రాత్రి వేళ నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఆయా వ్యాపార సంస్థల ముందు వాహనదారులు తమ వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుంచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- బీఎస్‌రెడ్డినగర్ చైతన్యనగర్‌లో బీడీరెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో తరచు ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది లేకపోవడంతో వాహనదారులే వాహనాలను క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి.

స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం...

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో రోడ్లపై పార్కింగ్‌లతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న విషయం నిజమే. పార్కింగ్ సదుపాయం లేని వాణిజ్య భవనాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సరిపోను సిబ్బంది లేరు. వనస్థలిపురం రైతుబజారు, బీడీరెడ్డిగార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలలో రద్దీవేళల్లో ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుళ్లను పెడుతున్నాం. తరచుగా బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం వరకు స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నాం. రోడ్లపై పార్కింగ్ చేసిన వారికి చాలాన్లు రాస్తున్నాం. రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నాం.

– బాలూ చౌహాన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, వనస్థలిపురం



వనస్థలిపురం రెడ్ వాటర్‌ట్యాంక్ కూడలిలో..



వనస్థలిపురం గణేష్ టెంపుల్ వద్ద రాత్రివేళ..



వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై చేసిన పార్కింగ్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో శుక్రవారం దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- **ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు...**
జీపీ బ్యాంక్ కాలనీ, త్రివేణినగర్, వీకే ధాగేనగర్ పరిసర ప్రాంతాలు
- **ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...**
పీఅండ్‌టీ కాలనీ కొంటర్ చౌరస్తా, కమ్యూనిటీ హాల్, కోదండరామ్ నగర్, హనుమాన్ టెంపుల్, వీవీ నగర్, శారదా నగర్ పరిసర ప్రాంతాలు
- **మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు...**
భూలక్ష్మీనగర్, తిరుమల హిల్స్, గడ్డిఅన్నారం, కళ్యాణ్‌నగర్, రెవిన్యూ బోర్డ్ కాలనీ, గడ్డిఅన్నారం నారాయణ కాలేజ్, ఏపీఏయూ కాలనీ, వెంకటేశ్వరా కామర్స్ కాలేజ్, వాణిజ్య విహార్, నలందా కాలేజ్, బిగ్ సీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన తెలిపారు.

సీఐకు సన్మానం

దిల్‌సుఖ్‌నగర్: చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా భాధ్యతలు చేపట్టిన వేంకటేశ్వర్లు గురువారం ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పున్న గణేష్ నేత మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా ఉండాలని,కాలనీలో గస్తీని పెంచి నిఘా వ్యవస్థను పటిష్టం ఉంచాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావ్ ,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు శివ, దుర్గా ప్రసాద్, పోట్ట బతిని నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



హస్తినాపురం ఇంద్రప్రస్థకాలనీలో రోడ్డు మరమ్మతు పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిద ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని అందుకు ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు చేయించాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్‌రోడ్డు నుండి ఇంద్రప్రస్థ కాలనీకి వెళ్లే రోడ్డుకు 10 లక్షల రూపాయలతో చేపడుతున్న మరమ్మత్తు పనులను ఇంజనీరింగ్ అధికారులతో కార్పొరేటర్ సుజాతనాయక్ ప్రారంబించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ రోడ్లు గుంతలు పడి ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకురావడంతో జీహెచ్‌ఎంసీ నుండి 10 లక్షల రూపాయలు మంజూరు చేయించి రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, కాలనీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, రాజశేకర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జానకీరామ్‌నాయక్ , రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలవాలి



భూపేశ్‌గుప్తానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్తున్న నారగోని శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలవాలని, వారిని అన్ని విదాలుగా ప్రోత్సహిస్తే వారు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణిస్తారని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిదిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను విజ్ఞానయాత్రకు తీసుకెళ్లేందుకు ఉచితంగా బస్సును ఏర్పాటు చేసి వారిని తీసుకెల్లేందుకు శ్రీనివాస్ యాదవ్ ఉపాధ్యాయులతో కలిసి జెండా ఊపి పంపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెలుతున్నామని అన్నారు. నగరంలోని జూపార్కు, గోల్కొండ, సాలార్‌జంగ్ మ్యూజియం తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి వారికి వాటి చరిత్ర గురించి వివరించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.డేవిడ్, ఎస్.విజయ్ కుమార్, ఎం.వేణుగోపాల్, టి.నాగమణి, పి.సునిత, బి.సంఘమిత్ర, ఎస్.రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపివేయండి

సైదాబాద్: పురాతన హనుమాన్ దేవాలయం పైనుండి వెళ్లేలా సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆమె బీజేపీ కార్పొరేటర్‌లతో కలిసి జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం వలన సైదాబాద్ పరిసర ప్రాంతాల్లో అందోళనకర వాతావరణం నెలకొందని అన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వలన భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్‌లు కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి, ఆలె భాగ్యలక్ష్మి ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

త్రిపుర గవర్నర్‌కు సత్కారం



చైతన్యపురి: త్రిపుర గవర్నర్ గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి గురువారం చైతన్యపురిలోని ఖమ్మం పార్లమెంటు బీజేపీ ఇంచార్జి జె.శ్రీకాంత్ నివాసంలో ఇచ్చిన అల్పాహార విందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా చైతన్యపురి, గడ్డిఅన్నారం కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్త, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిలు గవర్నర్‌ను ఘనంగా సత్కరించారు.

కాలనీలలో పర్యటించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ఎల్‌బీనగర్: కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచిరెడ్డి తెలిపారు.డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ ఫేజ్ 1,2,3 కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు గురువారం కాలనీల వాసులతో కలిసి కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు.అనంతరం లచ్చిరెడ్డి మాట్లాడుతూ సమస్యలపై అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో సమీక్షించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నాయకులు భావన శ్రీనివాస్, సరస్వతి, విష్ణువర్ధణ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రుత్విక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కరించాలని గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మట్లాడుతూ 118జీఓకు సంబంధించిన పత్రాలు సబ్‌రిజిస్ట్రార్, ఎంఆర్‌ఓ వద్ద ఉన్నాయని వాటిని వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇబ్రహింపట్నం, కందుకూరు ఆర్‌డీఓలు అనంతారెడ్డి, సూరజ్ కుమార్‌చ ఎంఆర్‌ఓలు సునీతరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 21, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 19. దొండ 35, ఆలు 21, ఉల్లి 20, గోకర 50, దోస 19, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 35, ఆర్వి 40, మునగ 75, చిలగడదుంప 55, బీట్‌రూట్ 17.

అంతర్జాతీయ సౌకర్యాలతో పాఠశాలలను నిర్మించాలి

మలక్‌పేట: గడ్డి అన్నారం న్యూ కమ్యూనిటీ యూత్ అసోసియేషన్ నాయకులు గురువారం తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ బి.ఆనంద్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా 'దళిత బంధు పథకం' రద్దు చేయాలని, ఎస్సీ విద్యార్థుల కోసం అంతర్జాతీయ సౌకర్యాలతో పాఠశాలలను నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్యామ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకం ద్వారా కొన్ని కుటుంబాలకు మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. చదువుతోనే ఎస్సీల బతుకులు మారుతాయన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి తోడ్పాడు అందించాలన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి. లక్ష్మణ్, ఎస్సీ హస్టల్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కుమారన్న, తెలంగాణ దళిత సమితి అధ్యక్షుడు బొట్టు శ్రీనివాస్, రాజశేఖర్, సంతోష్ జీఎంను కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రికి ఆలయ పాలక మండలి సభ్యుల ఆహ్వానం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజినేయ స్వామివారి ఆలయ పాలక మండలి ఛైర్మన్ నల్లా రఘుమారెడ్డి, ఈఓ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖను కలసి ఆలయంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఆమెను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను, శేష వస్త్రాలను అందచేశారు. సభ్యులు ఆనంద్‌గౌడ్, సతీష్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



మంత్రి కొండ సురేఖను సన్మానిస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

ప్రభుత్వ స్థలాల పరిశీలన

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామ సర్వే నెంబర్ -5, సర్వే నెంబర్-93, రాక్‌టౌన్‌కాలనీలోని స్మశానవాటికల స్థలాలను కందుకూరు ఆర్‌డీఓ సూరజ్‌కుమార్, సరూర్‌నగర్ మండల తహసిల్దార్ కృష్ణ గురువారం పరిశీలించారు. సర్వే నెంబర్-5లో చంద్రకళ అనే మహిళ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు ఆర్‌డీఓ తెలిపారు. స్థానికంగా చేపట్టిన నాలా నిర్మాణంతో తన స్థలాన్ని కోల్పోయానని, అప్పుడు అధికారులు ఇచ్చిన హామీ మేరకు నిర్మాణం చేపడుతున్నట్లు చంద్రకళ ఆర్‌డీఓకు వివరించారు. చంద్రకళ వద్ద ఉన్న పత్రాలు, ఆధారాలను పరిశీలన చేసి సదరు నిర్మాణంపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని, కలెక్టర్ ఆదేశాలతో చర్యలు చేపడుతామని మండల తహసిల్దార్ కృష్ణ పేర్కొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

సైదాబాద్: స్వశక్తితో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని భాగ్యనగర్ జిల్లా బ్యాంకర్స్ గ్రూప్ అధ్యక్షుడు ప్రసాదరావు అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు ఆశ్రమంలో గురువారం మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ, జనపనార బ్యాగుల తయారీ కేంద్రంలో ఆయన పాల్గొన్నారు. కుట్టు శిక్షణ కేంద్రంలో 41 మంది, జూట్ బ్యాగ్‌ల తయారీ కేంద్రంలో 20 మంది మహిళలు పాల్గొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం ద్వారా సమాజం పురోగతి సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో శిక్షణా మాస్టర్ కవితారెడ్డి, సమితి అధ్యక్షుడు కె.సత్యమూర్తి, కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు, కోశాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాగోలు: ప్రైవేట్ బస్సు ఢీ కొట్టిన సంఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గత నెల 31 వ తేదీన రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నాగోలు ఫ్లైఓవర్ నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ ప్రైవేట్ బస్సు అతనిని వెనుకు నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన రక్తగాయాలు కాగా చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి గ్రీన్ కలర్ టీ షర్ట్ , గ్రే కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT SHADNAGAR
OS No. 85 of 2021

Between:-
Kottam Kanthamma ..Plaintiff
And,
Manusani Vimalamma & Others ...Defendants

NOTICE

To,
D.6. **Smt.Allvelu**, W/o Narayan Reddy, Aged 60 years, Occ: Agriculture, R/o.Vasupula Village, Midgi Mandal, Mahabubnagar District.
D.9. **Govind Jagath Reddy**, S/o Late Laxma Reddy, Aged 50 years, Occ: Agriculture, R/o.Dannaram Village, Kandukur Mandal, Ranga Reddy District.
D.11. **Smt.M.Suvarna**, W/o Malla Reddy, Aged 55 years, Occ: Housewife, R/o. Bachupally Village, Kandukur Mandal, Jaithwaram Post, Ranga Reddy District.
D.15. **Mohd.Fasiuddin**, S/o MD. Nizamuddin, Aged 60 years, Occ:Business, R/o.H.No.16-2-58/1/B/3, Akbarbagh, Malakpet, Hyderabad

Please take notice that the Plaintiff filled the above suit for partition and separate possession of the suit schedule property and to declare the registered documents as null and void and not binding on the plaintiff against you and others. And the suit is posted for your appearance on 07-02-2024 at 10.30 am before the Hon'ble Junior Civil Judge at Shadnagar. Therefore you are hereby requested to appear before the above Hon'Ble Court either in person or through Advocate and answer the claim of the Plaintiff, failing which the matter will be decided as per material available on recorded and else the case will be heard and decided in your absence.

// BY ORDER OF THE COURT//
KANCHI RAJAGOPAL, Advocate
Shadnagar Town, Farooqnagar Mandal, Ranga Reddy Dist.Mobile :- 9090622555